క్లుప్తంగా

గ్రామాల అభివృద్ధే లక్ష్యం



సీసీ రోడ్డు పనులు చేస్తున్న దృశ్యం

సంబేపల్లె : గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని వైఎస్సార్‌సీపీ నాయకుడు వీవీ ప్రతాప్ రెడ్డి, సర్పంచ్ రామచంద్రలు పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రం లోని బొగ్గువారిపల్లెకు వెళ్లే దారికి రూ. 10 లక్షల నిధులతో సిమెంట్ రోడ్డు పనులను వారు ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గ్రామాల అభివృద్ధి కోసం కోట్లాది రూపాయలు మంజూరు చేశారన్నారు. రోడ్డు నిర్మాణంపై ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

వనభోజనాలు



రాజుకుంట గ్రామంలో వనభోజనాలకు హాజరైన గ్రామస్తులు

చిట్వేలి : కార్తీక మాసం చివరి సోమవారాన్ని పురస్కరించుకొని మండల పరిధిలోని రాజుకుంట గ్రామంలో వనభోజన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం 9 గంటల నుంచి గ్రామంలోని అన్ని కుటుంబాల వారు రాజుకుంట చెరువు పైతట్టు ప్రాంతంలోని రిజర్వు ఫారెస్టులో వన భోజనాలను ఏర్పాటు చేసుకున్నారు. తీసుకెళ్లిన రకరకాల వంటలను పరస్పరం వడ్డించుకున్నారు. చిన్నా, పెద్ద అనే తేడా లేకుండా అందరూ చెరువులో స్నానాలు ఆచరించి వనదేవతకు పూజలు చేశారు. సాయంత్రం 4 గంటలకు అడవి నుంచి గ్రామానికి చేరుకున్నారు. గ్రామస్తులంతా వనభోజనాలకు అడవికి చేరుకోగా గ్రామ నౌకర్లు గ్రామాన్ని కాపలా కాచారు.

కార్మికులను పర్మినెంట్ చేయాలి



నిరసన ప్రదర్శన చేస్తున్న కార్మికులు

రాయచోటి అర్బన్ : రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీలలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కార్మికుల సమస్యల పరిష్కారం పట్ల పాలకులు అనుసరిస్తున్న నిర్లక్ష్య విధానానికి నిరసనగా కార్మికులు మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన చేశారు. గత నాలుగేళ్లుగా మున్సిపల్ రంగంలో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ పారిశుధ్య, ఇంజనీరింగ్, మున్సిపల్ పాఠశాలల స్వీపర్‌ల సమస్యలను పరిష్కరించాలని ఆందోళన చేస్తున్నప్పటికీ పాలకులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కార్మికులకు 11వ పీఆర్‌సీ ప్రకారం రూ. 20వేల వేతనం, కరువు భత్యాలను వెంటనే ఇవ్వాలన్నారు. కోవిడ్ సమయంలో విధులలోకి తీసుకున్న కార్మికులను కొనసాగించాలన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 27 నుంచి ప్రారంభమయ్యే మున్సిపల్ కార్మికుల సమ్మెను జయప్రదం చేయాలంటూ కోరారు. అనంతరం మున్సిపల్ కమిషనర్‌కు సమ్మె నోటీసును అందజేశారు. కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నేతలు కేశవరావు, శేషాద్రిబాబు, ఈశ్వరయ్య, రెడ్డెయ్య, భరత్‌చంద్ర, చంద్రశేఖర్, చిట్టెమ్మ తదితరులు పాల్గొన్నారు.

విశిష్టమైనది కార్తీక వనభోజనం



దర్బారు సాయి పూజల్లో భక్తులు

రామాపురం : మాసాలలో కార్తీక మాసం ఎంతో పవిత్రమైందని, అదే మాసంలో వనభోజనానికి కూడా అంతే విశిష్టత ఉందని దర్బారు సాయి భక్తులు పేర్కొన్నారు. మండలంలోని నీలకంఠ్రావుపేట సమీపంలోని గల దర్బారు సాయి నగర్ అనంత ఆశ్రమంలో ఉద్యానవనంలో కార్తీక మాస ఆఖరి సోమవారం సందర్భంగా వనభోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. బెంగళూరుకు చెందిన వేద పండితులు నరేంద్ర ఆచార్యులు ముక్త రామలింగేశ్వర స్వామికి విశేషంగా నమమక, చమక, శ్రీ సూక్త, పురుష సుక్త రుద్రాభిషేక పూజలు నిర్వహించారు. వన మహోత్సవ విశిష్టత వివరించారు.

దోమల అంతం అందరి బాధ్యత

వీలేరు : వ్యాధులను వ్యాప్తి చేసే దోమల అంతం మనందరి బాధ్యత అని డాక్టర్ రమేష్‌రెడ్డి అన్నారు. సోమవారం తలపులలో దోమల నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. దోమకాటుతో డెంగ్యూ, చికెన్ గున్యా, మలేరియా తదితర వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందన్నారు.

వీరభద్రుడి ఖ్యాతిని దశదిశలా వ్యాపింపచేద్దాం

- పశ్చిమ రాజగోపురం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి
- మాసాపేటలో పలు అభివృద్ధి పనుల ప్రారంభం



రాయచోటి టౌన్: కలశాల అభిషేక పూజలో ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి



రాయచోటి అర్బన్: అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

రాయచోటి టౌన్ : అధికారంలోకి వచ్చిన తరువాత తాను మొదటి సంతకం చేసింది శ్రీ వీరభద్రస్వామి వారి పశ్చిమ రాజగోపుర నిర్మాణ ఫైల్ పైనే అని రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. సోమవారం రాయచోటిలో దక్షిణ కాశీగా పిలవబడే శ్రీ భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి వారి ఆలయంలో ఐదు అంతస్తుల పశ్చిమ రాజగోపురం, సాలాహారం, ప్రారంభోత్సవంలో ఆయన ఆలయ పాలకమండలి అధ్యక్షురాలు పాలంరెడ్డి విజయ, మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా, వైస్ చైర్మన్ పాలంరెడ్డి దశరథరామిరెడ్డి, దేవాదాయశాఖ జిల్లా అధికారి విశ్వనాథ, ఆలయ ఈఓ డివి రమణారెడ్డిలతో కలసి నిర్మాణాలకు సంబంధించిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ శుక్రవారం నుంచి ఆదివారం వరకు వేదపండితుల ఆధ్వర్యంలో పశ్చిమ రాజగోపురం పూజలు, హోమాలు, కలశస్థాపన కార్యక్రమాలను పవిత్రంగా నిర్వహించారని చెప్పారు. పాలక మండలి సభ్యుల సహకారం, దాతల దాతృత్వంతో పశ్చిమ రాజగోపురంతోపాటు మాఢవీధులు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. పశ్చిమ రాజగోపురం నిర్మాణం పూర్తయిన తరువాత ఆలయానికి నాలుగువైపులా రాజగోపురాలు ఉండటం చాలా గొప్ప శుభసూచకమన్నారు. వీరభద్రస్వామి ఆలయం రాయచోటి ప్రాంతానికి మతసామరస్యానికి ప్రతీకగా నిలవాలని ఆకాంక్షించారు. అనంతరం ఆలయం వద్ద భక్తుల సౌకర్యార్థం నిర్మిస్తున్న వసతి భవనాన్ని ఆయన పరిశీలించారు. దాతల సహకారాన్ని కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్, కమిటీ సభ్యులు నాగభూషణం, కర్నాటక శ్రీ వీరభద్రస్వామి కమిటీ సభ్యులు శివ శరణ్, లక్ష్మిపతి, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పబ్బిశెట్టి సురేష్‌కుమార్, సాదిక్ అలీ, డీసీసీబీ డైరెక్టర్ వెంకట్రామిరెడ్డి, ఆసీఫ్ అలీఖాన్, ఫయాజ్ అహ్మద్, వాల్మీకి సంఘం జిల్లా అధ్యక్షులు గువ్వల బుజ్జిబాబు, పాదలపల్లె గోపాల్‌రెడ్డి, నేలపాటి వెంకటేష్, నాసీర్, హజరత్ ఖాదర్‌వలి, వలీ, విక్కీ, దేవేంద్ర, ఏవీ రమణ, మున్సిపల్ ఆర్‌ఐ మల్లికార్జున, వాటర్ షెడ్ ఇంజనీర్ నరసింహా రెడ్డిలు పాల్గొన్నారు.

మాసాపేట అభివృద్ధికి కృషి

రాయచోటి అర్బన్ : బాధ్యతగా పనిచేసి పట్టణాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. సోమవారం మాసాపేటలోని 2వ వార్డులో రూ. 15లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును, 34వ వార్డులో రూ. 80లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు, డ్రైనేజీలు, రూ.9 లక్షల సోలార్ నిధులతో మినరల్ వాటర్ ప్లాంట్, రూ.9లక్షల మున్సిపల్ నిధులతో నిర్మించిన మెప్మా సీఆర్‌సీ భవనాల శిలాఫలకాలను ఎమ్మెల్యే కౌన్సిలర్లు, వైఎస్ఆర్‌సీపీ నేతలతో కలసి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలోని మాసాపేట ప్రాంతం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. అహంభావం, అహంకారం, రౌడీయిజం లేకుండా సామరస్యంగా మెలుగుతూ మరింత బాధ్యతతో రాయచోటి అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. రాయచోటి జిల్లా కేంద్రంగా ఏర్పడడంతో మాసాపేట అభివృద్ధిలో నంబర్ 1 స్థానానికి చేరుకుందన్నారు. జగనన్న పాలనలో అర్హతే ఆధారంగా అర్హులందరికీ సంక్షేమం, అభివృద్ధి ఫలాలు అందుతున్నాయంటూ తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిల్లీస్ ఫయాజ్‌బాషా, వైస్ చైర్మన్ దశరథరామిరెడ్డి, కౌన్సిలర్లు పద్మావతి, గూడూరు అమ్మాజీ, సుగవాసి ఈశ్వర్, వైఎస్ఆర్‌సీపీ నేతలు ఇమ్రాన్, ఇర్షాద్, శ్యామ్‌కుమార్, హారూన్‌బాషా, బేపారి మహమ్మద్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్ర కిట్ల పంపిణీ



కిట్లను అందిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

రామాపురం : ఈనెల 15 నుంచి మండలంలో జరిగే ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా క్రీడా సామగ్రిని ఆయా గ్రామ సర్పంచ్‌లకు సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో మాజీ ఎంపీపీ జనార్దన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథరెడ్డి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు నాగభూషన్‌రెడ్డిలు పంపిణీ చేశారు. మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాలల్లోని సచివాలయం పరిధిలో ఈనెల 15వ తేదీ నుండి ఫిబ్రవరి 2వ తేదీ వరకు జరిగే ఆడుదాం ఆంధ్ర క్రీడలు జరుగుతాయని, క్రికెట్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, బ్యాడ్మింటన్ క్రీడలకు సంబంధించి క్రీడలు నిర్వహిస్తారన్నారు. ప్రతిభ గుర్తించి వారికి ప్రోత్సాహం అందివ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ హైదర్‌వలి, ఈఓపీఆర్‌డీ ఉషారాణి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఘనంగా అంబలం పూజ

మదనపల్లె సిటీ : స్థానిక టీటీడీ కళ్యాణ మండపంలో సోమవారం అయ్యప్పస్వామి అంబలం పూజ ఘనంగా జరిగింది. అర్చకులు రమణరావు, పూల నాగరాజు ఆధ్వర్యంలో స్వామి విగ్రహంతో పాటు పద్దెనిమిది మెట్లకు ప్రత్యేక అలంకరణ చేశారు. మాలధారులు భజనలు చేశారు.

ప్రజల సుఖశాంతుల కోసమే ‘పాదయాత్ర’

జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి



మాట్లాడుతున్న ఆకేపాటి అమర్‌నాథరెడ్డి

రాజంపేట టౌన్ : ప్రజలంతా సుఖసంతోషాలతో సుభిక్షంగా ఉండటం కోసమే గత ఇరవై సంవత్సరాలుగా తిరుమలకు పాదయాత్ర చేపడుతున్నట్లు జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి తెలిపారు. స్థానిక ఆర్అండ్‌బీ బంగ్లాలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆకేపాటి మాట్లాడారు. ఈనెల 15వ తేదీ ఆకేపాడులోని ఆలయాల సముదాయం నుంచి 21వ తిరుమల పాదయాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. అదే రోజు ఉదయం శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి దేవాలయంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణాన్ని ఘనంగా నిర్వహిస్తామన్నారు. కల్యాణం అనంతరం అన్నప్రసాద కార్యక్రమం పూర్తయిన వెంటనే పాదయాత్ర ప్రారంభవుతుందన్నారు. పాదయాత్రలో వేలాది మంది భక్తులు పాల్గొంటారని వారందరిని కూడా తిరుమలకు తీసుకెళ్ళి స్వామివారి దర్శనం కల్పించనున్నట్లు తెలిపారు. అన్నమయ్య కాలిబాట అభివృద్ధి చెందితే పాదయాత్ర ద్వారా తిరుమలకు వెళ్లే భక్తులకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, డీఆర్‌సీసీయా మెంబర్ తల్లం భరత్‌రెడ్డి, పాపినేని విశ్వనాథరెడ్డి, పోలి మురళీరెడ్డి, రెడ్డిమాసి రమేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

పుల్లంపేట : జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి ఈనెల 15న తిరుమలకు నిర్వహిస్తున్న 21వ పాదయాత్రను విజయవంతం చేయాలని మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ ముస్తాక్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు కుమార్ రెడ్డిలు కోరారు.

మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : రాష్ట్ర ప్రభుత్వం మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చి ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ పేర్కొన్నారు. సోమవారం మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలని కోరుతూ స్పందనలో డీఆర్‌డీఏ పీడీ ఆనంద్ నాయక్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత డీఎస్సీ నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. విజయవాడ, హైదరాబాదు వంటి నగరాల్లో సంవత్సరాల తరబడి కోచింగ్ తీసుకుంటూ కాలం వెల్లబుచ్చుతున్నారని వాపోయారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు షాకీర్, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

ఆ వార్డెన్‌లపై చర్యలు తీసుకోవాలి

కడప ఎడ్యుకేషన్ : అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న బీసీ సంక్షేమ హాస్టళ్లలోని కొందరు వార్డెన్‌లపై చర్యలు తీసుకోవాలని ఆర్ఎస్‌వైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కన్నెలూరు శంకర్ డిమాండ్ చేశారు. సోమవారం కడపలోని రాష్ట్ర కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. జిల్లాలో కొందరు బీసీ బాలుర ప్రీమెట్రిక్ హాస్టల్, పోస్టు మెట్రిక్ హాస్టల్‌లలో పిల్లలు లేకపోయినా విద్యార్థుల హాజరు నమోదు చేసి బిల్లులు చేసుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి నాగేంద్రబాబు, నగర నాయకులు ఆజాద్, సోహెల్ పాల్గొన్నారు.

సంకల్పంతో సాగండి

తంబళ్లపల్లె : సమాజంలో సంకల్పంతో ముందుకు సాగాలని, ఆ బలంతో వైకల్యం చిన్నబోతుందని ఎంఈవో త్యాగరాజు అన్నారు. సోమవారం స్థానిక భవిత కేంద్రంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఆటల పోటీలలో ప్రతిభ చూపిన పిల్లలకు ట్యాబ్‌లు, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సురేంద్రనాథ్, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి, ఐఈఆర్‌టీ టీచర్లు రాధా, రేఖ, ఫిజియోథెరపిస్టు సరళ, టీచర్ సాంబశివ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గుంటి గంగమ్మ జాతర

వాల్మీకిపురం: చింతపర్తి పంచాయతీ మేకలవారిపల్లిలో సోమవారం శ్రీ గుంటి గంగమ్మ జాతర వైభవంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి అర్చన, అభిషేకం నిర్వహించారు. అనంతరం మహిళలు దీలుబోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. రాష్ట్ర ఏపీ ఎండీసీ డైరెక్టర్ హరీష్ రెడ్డి గుంటి గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలు పాడిపంటలు, సుఖశాంతులతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఓరుగంటి రమేష్, లక్ష్మి నారాయణ రెడ్డి, నరసింహులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

మండల అధికారులకు ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి సూచన



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సుదర్శన్ రెడ్డి

లక్కిరెడ్డిపల్లె : మండల సమావేశంలో సభ్యులు ప్రస్తావించిన సమస్యలను మండలస్థాయి అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించేలా కృషి చేయాలని ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ సభా భవనంలో మండల సమావేశాన్ని జెడ్పీటీసీ రమాదేవితో కలిసి నిర్వహించారు. శాఖల వారీగా సమస్యలపై ఆరా తీశారు. కరువు మండలంగా లక్కిరెడ్డిపల్లె మండలాన్ని ప్రకటించడంతో జాబ్ కార్డు ఉన్న ప్రతి కూలీకి 150 పని దినాలు కల్పించి, బిల్లులు సకాలంలో చెల్లించేలా చూడాలని కో-ఆప్షన్ సభ్యులు సయ్యద్ అమీర్ సూచించారు. పనులకు సంబంధించి ప్రణాళికను సిద్ధం చేసేలా చూడాలని వైస్ ఎంపీపీ సమరసింహా రెడ్డి విజ్ఞప్తి చేశారు. రైతులకు సంబంధించి ఎరువులు, పురుగుమందులు రైతు భరోసా కేంద్రాలలో అందుబాటులో ఉండేలా చూడాలని సభ్యులు కోరారు. అనంతపురం గ్రామానికి సంబంధించి రీ సర్వే జరిగి ఆరు నెలలు అయినా పాస్ పుస్తకాలు పంపిణీ చేయలేదని, రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంపై వైస్ ఎంపీపీ మండిపడ్డారు. రీ సర్వే జరిగిన గ్రామాలలో తక్కువ, ఎక్కువ పడిన భూముల వివరాలను సరిచేయాలని డిప్యూటీ తహసీల్దార్ రెడ్డన్నకు సభ్యులు సూచించారు. జగనన్న కాలనీకి సంబంధించి దారి ఏర్పాటు చేయాలని ఉపసర్పంచ్ రాజారెడ్డి సభా దృష్టికి తీసుకువచ్చారు. పశువులకు సంబంధించి రైతుల వద్దకు వెళ్లి ఇన్సూరెన్సు చేయించే బాధ్యత తీసుకోవాలని పశువైద్యాధికారికి సూచించారు. దిన్నెపాడు గ్రామానికి అమూల్ పాల డైరీ కావాలని పాడి రైతులు కోరుతున్నట్లు చెప్పారు. మండల సమావేశానికి డుమ్మా కొట్టిన పశుసంవర్ధకశాఖ ఏడీపై చర్యలు తీసుకోవాలని వ్యవసాయశాఖ సలహామండలి సభ్యులు రవిరాజు ఎంపీపీ దృష్టికి తీసుకువచ్చారు. చింతకుంటవాళ్లపల్లెలో తాగునీటి సమస్యపై తక్షణమే స్పందించి ప్రజల దాహార్తి తీర్చాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కిషోర్‌కు ఎంపీపీ సూచించారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి రైతుకు 15 రోజులోపు నూతన ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని ట్రాన్స్‌కో ఏఈకి తెలిపారు. ఉద్యానశాఖలో భాగంగా పూల మొక్కలు నాటుకొని నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించడానికి నివేదికలు ప్రభుత్వానికి పంపించామని ఉద్యానశాఖ అధికారిణి నాగమణి తెలిపారు. పురుగు మందులు రైతులకు అందుబాటులో ఉంచడానికి ప్రయత్నిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటరమణారెడ్డి, వైస్ ఎంపీపీ రౌతు నాగలక్ష్మీ, ఎంపీటీసీలు దస్తగిరి, ఉదయగిరి ఎల్లమ్మ, లక్ష్మీనారాయణ, జగన్‌మోహన్ రెడ్డి, వాటర్ షెడ్ చైర్మన్ సుబ్బరాజు, సర్పంచ్‌లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండండి



సమస్యలు వింటున్న ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథరెడ్డి

వీరబల్లె (రాయచోటిటౌన్) : సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథరెడ్డి సూచించారు. సోమవారం ఎంపీడీఓ మల్లీశ్వరి ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా కురిసిన వానలకే అక్కడక్కడ మురుగునీరు నిలిచిపోయి దోమలకు నిలయంగా మారి తద్వార జబ్బులు ప్రబలే అవకాశం ఉందన్నారు. అలాగే వీరబల్లె మండలంలో ఎక్కువగా మామిడి తోటలు ఉన్నాయని ఈ ఏడాది వర్షాలు సక్రమంగా కురవలేదు కాబట్టి వచ్చే వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా ముందు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. మామిడి తోటలను కాపాడుకోవడం కోసం తీసుకోవాల్సిన సూచనలు, సలహాలు రైతులకు ఇవ్వాలని ఉద్యానశాఖ అధికారులకు సూచించారు. కరువు దృష్ట్యా ఉపాధి పనులు మరో 50 రోజులు కలిప్తున్నట్లు తెలిపారు. అలాగే త్వరలో ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శివరాంగౌడ్, ఎంపీటీసీ, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కళా ఉత్సవ్‌కు విద్యార్థులు



పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

రాయచోటి టౌన్ : జిల్లాస్థాయి ఉత్సవ్ నుంచి రాష్ట్రస్థాయి ఉత్సవ్‌కు రాయచోటి ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ రేఖ తెలిపారు. జిల్లాస్థాయి ఉత్సవ్ కళ పోటీలు సోమవారం రాయచోటి డైట్ కేంద్రంలో నిర్వహించారు. ఈ పోటీలలో తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు తొమ్మిది మంది చేతన (డ్రామా), పురుషోత్తం (డ్రామా), దేవకీ (బొమ్మల తయారీ), వైశాలి (ఫోక్ సాంగ్), దీపక్ (బొమ్మల తయారీ), జీకే లక్ష్మిప్రసాద్ (మ్యూజిక్), విఘ్నేష్ (ఫోక్ సాంగ్), నందివర్ధన్ (క్లాసికల్), రెడ్డి ఉషంత్ (2డీ) విభాగాలలో తమ ప్రతిభను కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని తెలిపారు. వీరు బుధవారం విజయవాడకు వెళ్లనున్నట్లు వివరించారు. విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

15న కెరీర్ డెవలప్‌మెంట్‌పై అవగాహన సదస్సు

సంబేపల్లె : పదోతరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు కెరీర్ డెవలప్‌మెంట్‌పై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు సాయి ఇంజనీరింగ్ కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ సుధాకర్ రెడ్డి తెలిపారు. సోమవారం ఉదయం మండల కేంద్రంలోని సంబేపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మడితాటి నరసింహారెడ్డికి ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను అందజేశారు. ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 15న ఉదయం రాయచోటిలోని సాయి ఇంజనీరింగ్ కళాశాల ఓపెన్ ఆడిటోరియంలో మోటివేషనల్ స్పీకర్‌గా పేరుపొందిన మల్లవరపు బాలలత విద్యార్థులకు కెరీర్ గైడెన్సుపై అవగాహన కల్పిస్తారన్నారు. విద్యార్థులలో పరీక్షల పట్ల ఉన్న భయాన్ని పోగొట్టి వారి జీవితాల్లో ఉన్నత స్థానానికి ఎదగడానికి సదస్సు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. విద్యార్థులు సదస్సును సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పకడ్బందీగా సామాజిక సాధికార బస్సుయాత్ర ఏర్పాట్లు



భోజన సౌకర్యాలను పరిశీలిస్తున్న ఎంపీపీ మేడా

రాజంపేట : పట్టణంలో మంగళవారం చేపట్టే సామాజిక సాధికారిత బస్సుయాత్రకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నారు. యాత్రకు తరలివచ్చే వారికి భోజన శిబిరాలను ఏర్పాటు చేస్తున్నారు. నందలూరు, వీరబల్లి, సిద్దవటం మండలాల నుంచి వచ్చే వారికి కోసం గుండ్లూరు వద్ద భోజన శిబిరాలను ఏర్పాటు చేశారు. ఈ ఏర్పాట్లను నందలూరు మండలాధ్యక్షుడు మేడా విజయభాస్కర్‌రెడ్డి పరిశీలించారు. వచ్చిన వారికి ఆకలి తీర్చే విషయంలో ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవాలని ఆర్గనైజర్స్‌కు సూచించారు. రవాణా సదుపాయంపై ఎంపీపీ చర్చించారు. ఎంపీపీ వెంట నందలూరు జెడ్పీటీసీ గడికోట ఉషా సుబ్బారెడ్డి, వక్ఫ్ బోర్డు జిల్లా సెక్రటరీ సయ్యద్ అమీర్, మండల పార్టీ కన్వీనరు అన్నం నాగేంద్ర, జేసీఎస్ కన్వీనరు కలీంఖాన్, ఆర్ముగం విశ్వనాథ్, ఓర్సు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను మంజూరు చేయండి



రాజంపేట టౌన్: డీజీపీకి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి



రైల్వేకోడూరు అర్బన్: సత్యమ్మకు పూజలు చేస్తున్న డీజీపీ రాజేంద్రనాథరెడ్డి, రక్కాసి ధనుంజయరెడ్డి

రాజంపేట టౌన్ : రాజంపేటకు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ మంజూరు, డీఎస్పీ కార్యాలయానికి సొంత భవనాల నిర్మాణానికి ప్రత్యేక చొరవ చూపాలని ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి డీజీపీ కసిరెడ్డి రాజేంద్రనాథరెడ్డిని కోరారు. డీజీపీ సోమవారం రాయచోటికి వెళ్తుండగా ఆయనకు రాజంపేటలో ఎమ్మెల్యే ఘన స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా పై సమస్యలను ఎమ్మెల్యే డీజీపీ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీకి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ విభాగాల కన్వీనర్లు పాల్గొన్నారు.

సత్యమ్మకు పూజలు నిర్వహించిన డీజీపీ

రైల్వేకోడూరు అర్బన్ : రాష్ట్ర డీజీపీ రాజేంద్రనాథరెడ్డి మండలంలోని అనంతరాజుపేట పంచాయతీలోని తంబిళ్లవారిపల్లెలో వెలసిన సత్యమ్మ తల్లికి సోమవారం సీఎం సలహాదారు రక్కాసి ధనుంజయరెడ్డితో కలిసి పూజలు నిర్వహించారు. డీజీపీ మాట్లాడుతూ చాలా కాలం తరువాత బంధువులను, స్నేహితులను కలుసుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. అనంతరం పట్టణంలోని గురువిరెడ్డి నివాసానికి చేరుకుని అల్పాహారాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో ముద్దా బాబుల్‌రెడ్డి, పంజం సుకుమార్‌రెడ్డి, సాయికిషోర్‌రెడ్డి, చెవ్వు శ్రీనివాసులరెడ్డి, ఓబి శ్రీనివాసులరెడ్డి, జెడ్పీటీసీ రత్నమ్మ, ప్రశాంతి రమేష్, ఎంపీటీసీలు జనార్దన్ రాజు, బండారు మల్లికార్జునలు, ముక్కా మధుసూదన్ రెడ్డి, రక్కాసి జయచంద్రారెడ్డి, రామచంద్రారెడ్డి, రాజారెడ్డి, కరుణాకర్‌రెడ్డి, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్యలు వద్దు..

కడప ఎడ్యుకేషన్ : ఉపాధ్యాయుల సమస్యలపై ఆత్మహత్యలు వద్దు, పోరాడి సాధించుకుందామని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి పేర్కొన్నారు. సోమవారం కడపలోని ఎస్టీయూ భవన్‌లో జరిగిన నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతపురంలో ఉపాధ్యాయుడు మల్లేశ్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడడం బాధాకరం అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో కార్తీక పూజలు



రాయచోటి టౌన్: అలంకరణలో అగస్త్యేశ్వరుడు



పెనగలూరు మండలంలో..



రైల్వేకోడూరు: పూజల్లో పాల్గొన్న ప్రభుత్వవిప్ కొరముట్ల సతీమణి స్వర్ణకుమారి

కార్తీక మాస చివరి సోమవారాన్ని పురస్కరించుకొని మూడు నియోజకవర్గాల పరిధిలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వేకువజాము నుంచే ఆలయాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ముక్కంటీశ్వరుడికి ప్రత్యేక పూజలు జరిపించి మొక్కులు చెల్లించారు. మహిళలు కార్తీక దీపాలు వెలిగించి, నోములు నోచారు. రైల్వేకోడూరులోని భుజంగేశ్వర ఆలయంలో రైల్వేకోడూరు ఎమ్మెల్యే సతీమణి కొరముట్ల స్వర్ణకుమారి, రామాపురంలోని హరిహరాదుల ఆలయంలో రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేయించారు. భక్తులకు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. సంబేపల్లె పోలీసులు ఆధ్వర్యంలో మోటకట్ల శివాలయం వద్ద భక్తులకు అన్నప్రసాదాలు అందించారు. అలానే కార్తీక వన భోజనాల కార్యక్రమాలను నిర్వహించారు. – సాక్షి, నెట్‌వర్క్



రాజంపేట టౌన్: శివలింగాన్ని పూలతో అలంకరించిన దృశ్యం



చిట్వేలి: తమలపాకుల అలంకారంలో శ్యామలాంబ



సంబేపల్లె మండలం మోటకట్ల శివాలయంలో..



సిద్దవటం : సిద్దవటేశ్వరుడికి అభిషేకాలు చేస్తున్న భక్తులు